క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


జి.భద్రు

నూజివీడు: మండల తహసీల్దార్‌గా గగులోతు భద్రు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణాజిల్లా ఉయ్యూరులోని ఆర్డీఓ కార్యాలయ ఏఓగా పని చేస్తూ నూజివీడు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. గత ఎనిమిది నెలలుగా నూజివీడుకు రెగ్యులర్ తహసీల్దారు లేకపోవడంతో కార్యాలయ డెప్యూటీ తహసీల్దార్ బీవీ సుబ్బారావు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ భద్రును కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మైలవరంలో చలివేంద్రం ఏర్పాటు



మైలవరం: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంద కృష్ణ నాయకత్వంలో వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు మహాజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షుడు యలమర్తి నాగరాజు తెలిపారు. మైలవరం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇంకొల్లు జమలయ్య, యలమర్తి నాగరాజు, ప్రత్తిపాటి ఏసురత్నం, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థికి అభినందన



మైలవరం: ఈ ఏడాది పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థి వీరంకి హర్షిత్‌ను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అభినందించారు. మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన వీరంకి శ్రీధర్ కుమారుడు హర్షిత్ 597 మార్కులు సాధించాడు. మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో హర్షిత్‌తో పాటు అతని తల్లిదండ్రులు శ్రీధర్, చంద్రికలను ఎమ్మెల్యే అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే విధంగా ఉత్తమ ఫలితాలు సాధించాలని హర్షిత్‌ను ఎమ్మెల్యే ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

మన్యంవీరుడికి నివాళి



తిరువూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని తిరువూరు సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించారు. బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి ధైర్యసాహసాలతో పోరాడిన అల్లూరి జీవిత విశేషాలను ఉపాధ్యాయులు రాంప్రదీప్, హరికృష్ణ విద్యార్థులకు వివరించారు. అల్లూరి పోరాటస్ఫూర్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు పాపారావు, జగన్మోహనరావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా మిల్క్ యూనియన్

మునునూరు: పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ ఎల్లవేళలా అండగా ఉంటుందని గోగులంపాడు పాల సొసైటీ అధ్యక్షుడు తొర్లపాటి రాంబాబు అన్నారు. చింతలవల్లి శివారు గోగులంపాడు కొత్తూరుకు చెందిన చిమట శివయ్య ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అతను పాల సొసైటీలో సభ్యుడు కావడంతో క్షీరబంధు పథకం ద్వారా రూ.50 వేలు మంజూరయ్యాయి. బుధవారం సాయంత్రం మృతుడి భార్య భవానికి సొసైటీ అధ్యక్షుడు రాంబాబు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గణేష్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ పరమాత్మ ఆలయానికి ధ్వజ స్తంభం రాక



మునునూరు: శ్రీకృష్ణ పరమాత్మ ఆలయం వద్ద ధ్వజస్తంభానికి కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. మండలంలోని చెక్కపల్లిలో శ్రీకృష్ణ పరమాత్ముని ఆలయానికి ధ్వజ స్తంభాన్ని ఉమ్మడి కృష్ణా జిల్లా మైలవరం నుంచి చెక్కపల్లికి ట్రాక్టర్‌లో తరలించారు. బుధవారం సాయంత్రానికి చెక్కపల్లికి చేరుకున్న ధ్వజ స్తంభానికి కమిటీ సభ్యులు, గ్రామస్తులు మంగళ వాయిద్యాలతో ఎదురెళ్లి అత్యంత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయ బద్ధంగా ఊరేగింపుతో ఆలయం వద్దకు తరలించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని జూన్ 5వ తేదీన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు.

ఆందోళనలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

- కార్పొరేషన్ రద్దవుతుందని ప్రచారం
- ఉద్యోగ భద్రత కోల్పోతామని ఆవేదన
- ఆప్కాస్ కొనసాగించాలని కోరుతున్న కార్మికులు



తిరువూరు నగర పంచాయతీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు(ఫైల్)

తిరువూరు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఏపీ ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న కార్మికులు, ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తిరువూరు డివిజన్‌లో సుమారు 1200 మంది పొరుగు సేవల ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నారు. పురపాలక, రెవెన్యూ, గృహ నిర్మాణ, విద్యుత్, గ్రామీణాభివృద్ధి, మెప్మా, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, నీటిపారుదల శాఖలు, ఆర్టీసీ, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, విద్యాశాఖ కార్యాలయాల్లో, కోర్టుల్లో వివిధ హోదాల్లో పనిచేసే ఉద్యోగుల్లో అధిక శాతం ఔట్‌సోర్సింగ్ కార్మికులే ఉన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్స్, స్వీపర్స్, హెల్పర్స్, శానిటరీ మేస్త్రీలు, రాత్రి కాపలాదారులు, వంటపనివారు, మెకానిక్‌లు, టీచర్స్, ట్యూటర్స్, సీఆర్‌పీలు ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నారు.

11 నుంచి సమ్మె హెచ్చరికలతో..

గతంలో ప్రైవేటు కాంట్రాక్టర్లు, సర్వీస్ సొసైటీల ద్వారా అవసరమున్న కార్యాలయాల్లో కార్మికులను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించేవారు. కార్మికుల వేతనాలను ఆయా సొసైటీల ద్వారా ప్రభుత్వం చెల్లించేది. ఈ ప్రక్రియలో ప్రభుత్వం కార్మికులకు వేతనాల నిధులు విడుదల చేసినా కాంట్రాక్టర్లు నెలల తరబడి చెల్లించకుండా ఇబ్బంది పెట్టేవారు. జీతాలు చెల్లించేటపుడు పర్సంటేజీలు తీసుకోవడం, తమ ఇష్టానుసారం సిబ్బందిని మార్పు చేయడంతో ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండేది కాదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ కార్మికుల ఇబ్బందులను గుర్తించి ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వీరందరినీ దానికి అనుసంధానం చేసింది. ప్రభుత్వ యాజమాన్యంలోనే పనిచేసే కార్పొరేషన్ ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించడంతో పాటు భవిష్య నిధి చందా కూడా కార్మికుల ఖాతాలో జమచేసేది. ఉద్యోగులను తొలగించే అధికారం అధికారులకు సైతం లేకపోవడం, జిల్లా కలెక్టర్ అనుమతిస్తేనే తొలగింపులు, నియామకాలకు అవకాశం ఉండటంతో కార్మికులలో అభద్రతా భావం పోయి ఆత్మస్థైర్యంతో విధులు నిర్వర్తించేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తదుపరి ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ రద్దు చేసి మళ్లీ కాంట్రాక్టర్ వ్యవస్థను తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతుండటంతో కార్మిక సంఘాలు కన్నెర్ర జేస్తున్నాయి. ఈ నెల 11వ తేదీ నుంచి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమ్మెకు దిగుతామని ఔట్‌సోర్సింగ్ కార్మికులు హెచ్చరించడంతో ప్రభుత్వం ఆప్కాస్ రద్దు ప్రతిపాదనను తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు.



ఉద్యోగ భద్రత కరువు..

ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌ను రద్దు చేస్తే కార్మికులకు ఉద్యోగ భద్రత కరువవుతుంది. కాంట్రాక్టర్ల కింద పనిచేయడంతో కార్మికులకు వేతనాలు సరిగా అందక అర్ధాకలితో బతకాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ రద్దు చేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలి.

– బి.వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు, తిరువూరు



కార్పొరేషన్ రద్దు తగదు..

తక్కువ వేతనమైనా ఔట్ సోర్సింగ్ కార్మికులు కార్పొరేషన్ పరిధిలో ఉంటేనే అన్ని విధాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కాంట్రాక్టర్ల పర్యవేక్షణలో కార్మికులు పనిచేస్తే కనీస వేతనాలు ఇవ్వకపోగా ఇష్టానుసారం తొలగిస్తారు. ప్రభుత్వం కార్పొరేషన్‌ను కొనసాగించాలి.

– సీహెచ్ సత్యనారాయణ, ఔట్‌సోర్సింగ్ కార్మికుడు, తిరువూరు

ప్రజల్లో భద్రతాభావం పెంచేందుకు మాక్‌డ్రిల్

ఆగిరిపల్లి: భారత్ – పాక్ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బుధవారం ఎస్‌ఐ శుభశేఖర్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. యుద్ధ సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితిలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో కాకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ తవేరియా నాయక్, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


నూజివీడులో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది


ఆగిరిపల్లిలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు


చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

నూజివీడులో..

నూజివీడు: సంఘ విద్రోహ శక్తుల చర్యలను నిర్వీర్యం చేసేందుకు, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంచేందుకు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. రెవెన్యూ, పోలీస్, మెడికల్, ఫైర్ శాఖలకు చెందిన సిబ్బంది, అధికారులు పాల్గొని మాక్‌డ్రిల్ చేపట్టారు. పేలుడు ప్రమాదాలు జరిగినప్పుడు, సైరన్లు మోగినప్పుడు తక్షణం ఏమి చేయాలి, ప్రజల రక్షణకు చేపట్టాల్సిన చర్యలు, జాగ్రత్తలను మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్, పట్టణ సీఐ పి.సత్యశ్రీనివాస్, రూరల్ సీఐ కె.రామకృష్ణ, రూరల్ ఎస్‌ఐ జ్యోతీబసు, ఫైర్ ఆఫీసర్ మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయిలో మాక్‌డ్రిల్

చాట్రాయి: ఇండియా – పాకిస్తాన్ బోర్డర్‌లో ఉద్రిక్తతల నడుమ మండలంలోని చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. యుద్ధం జరిగే సమయంలో ప్రాణ రక్షణ, ఇతరులను కాపాడడం, వైద్యం అందించడం లాంటి అంశాలపై ఎస్‌ఐ రామకృష్ణ అవగాహన కల్పించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ గీత పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో కూటమి ప్రభుత్వం అలసత్వం


చంద్రగూడెంలో ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు సుధాకర్, వెంకటరెడ్డి తదితరులు

మైలవరం: ధాన్యం కొనుగోలులో కూటమి ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహిస్తోందని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ తెలిపారు. మైలవరం మండలం చంద్రగూడెం, మార్కెట్ యార్డు ప్రాంగణంలో మంగళవారం రాత్రి అకాల వర్షంతో తడిచిన వరి ధాన్యం రాశులను బుధవారం పార్టీ మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, కార్యకర్తలతో కలిసి సందర్శించి, రైతుల నుంచి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. సుధాకర్ మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలులో కూటమి ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని చెప్పారు. గత 13 రోజులుగా మార్కెట్ యార్డు వద్ద చంద్రగూడెం, పుల్లూరు, బాడవ తదితర ప్రాంతాలలో వరి రైతులు ధాన్యం రోడ్డుపై ఆరబెట్టుకుని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎదురుచూస్తున్నారన్నారు. కానీ ప్రభుత్వం నుంచి కొనుగోలు లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులకు గిట్టుబాటు ధర లేకపోయినా క్వింటా రూ.1400కే అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారన్నారు. దీని వల్ల క్వింటాకు రూ.350 వరకు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. సివిల్ సప్లయ్ అధికారులు కనీసం మార్కెట్ యార్డుకు వచ్చిన ధాన్యాన్ని కూడా పట్టించుకునే పరిస్థితి కన్పించడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కనీస గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రైతుల తరఫున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సరస్వతీనది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

తిరువూరు: ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతీ నది పుష్కరాలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం తిరువూరు నుంచి తెలంగాణ రాష్ట్రంలోని కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు తిరువూరు నుంచి బయలుదేరి యాదగిరిగుట్ట, బాసర, ధర్మపురి, కాళేశ్వరం, కొండగట్టు, వేములవాడ, వరంగల్, హన్మకొండ మీదుగా కాళేశ్వరానికి బస్సు నడుపుతున్నామన్నారు. ప్రయాణికుల అవసరాల మేరకు బస్సు సర్వీసులు నడుపుతామని, మరిన్ని వివరాలకు 88851 41446 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నీటి తీరువా పన్ను వసూలును వేగవంతం చేయాలి

చాట్రాయి: సచివాలయాల ద్వారా నీటి తీరువా వసూలును వేగవంతం చేయాలని తహసీల్దార్ గీత ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో నీటి తీరువా వసూలుపై బుధవారం సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం


మైలవరంలో యోగాసనాలు నేర్పిస్తున్న మాణిక్యాలరావు


నూజివీడు గ్రంథాలయంలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

మైలవరం: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగా మాస్టర్ ఎమ్.మాణిక్యాలరావు తెలిపారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో బుధవారం విద్యార్థులకు యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా మాస్టర్ మాణిక్యాలరావు మాట్లాడుతూ.. యోగాలో వివిధ అంశాలైన నేత్ర సంచలనం, కేచరి ముద్ర, భుచరి ముద్ర, ఏకాగ్రత పెరగడానికి శరీరానికి వచ్చే నొప్పులు తగ్గడానికి, చదివినది గుర్తు పెట్టుకోవడానికి కొన్ని టెక్నిక్స్‌ను వివరించారు. ప్రపంచానికి యోగా పరిచయం చేసింది భారతదేశమని, యోగా వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. దీనిలో భాగంగా బుధవారం విద్యార్థులతో యోగాసనాలు వేయించడంతో పాటు అనంతరం ధ్యానం చేయించారు. అలాగే పుస్తక పఠనం చేయించిన తరువాత పుస్తక సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవాలని, దీని వలన విజ్ఞానం పెంపొందించబడుతుందన్నారు. గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భారత ఆర్మీకి కృతజ్ఞతలు

ఆగిరిపల్లి: ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతంగా నిర్వహించిన భారత ఆర్మీకి అంగన్‌వాడీ రాష్ట్ర కార్యదర్శి అత్తి పార్వతి, సీతారామపురం సర్పంచ్ అత్తి మురళి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని సీతారాంపురంలో విలేకరులతో మాట్లాడుతూ దేశ ప్రజల మద్దతు మొత్తం ఎల్లప్పుడూ మీకు ఉంటుందని తెలిపారు.

కుట్టు మిషన్ల పేరుతో భారీ అవినీతి


ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వం మహిళలకు కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీ పేరుతో భారీ అవినీతికి తెరతీసిందని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు ఆరోపించారు. ఈ మేరకు బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మార్తాని శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మిక్కిలి శరభయ్యతో కలిసి కుట్టు మిషన్ భారీ స్కాంపై తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌లో రూ.6 వేలకు లభించే కుట్టు మిషన్లను కూటమి ప్రభుత్వం మహిళలకు రూ.23 వేలు చొప్పున అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడంతో భారీ అవినీతికి ఆస్కారం ఉందన్నారు. భారీ అవినీతిపై విచారణ జరిపి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గానికి చెందిన మహిళా విభాగం అధ్యక్షురాలు జి.రాణి, బీసీ విభాగం అధ్యక్షుడు కుంచం జయరాజు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సూరిబాబు, ఈశ్వరి, వసంతరావు, రాజేష్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి

నూజివీడు: కార్మికులు తమ సంక్షేమం, హక్కుల కోసం ప్రభుత్వాలు అమల్లోకి తెచ్చిన కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నూజివీడు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి అన్నారు. కార్మిక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్యాస్ కంపెనీ కార్యాలయంలో బుధవారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ.. అసంఘటిత, సంఘటిత కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టాలున్నాయని, కార్మికులు 8 గంటలు మాత్రమే పని చేయాలని, సమాన పనికి సమాన వేతనం పొందడం ప్రతి కార్మికుడి హక్కు అన్నారు. పని ప్రదేశంలో కార్మికులకు వసతులు కల్పించడం యజమాని బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం రమేష్, సెక్రటరీ హరిబాబు, ఏపీపీ వారా రాజ్‌కుమార్, న్యాయవాది నండూరి పద్మాంజలి పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

డ్రోన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోండి


ఆర్కే కళాశాలలో డ్రోన్స్ షోను ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ ఎంఎం.కొండయ్య తదితరులు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): సమాజంలో ప్రజలకు ఉపయోగకరంగా మారిన డ్రోన్స్ టెక్నాలజీని విద్యార్థులు ఒడిసిపట్టుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆర్కే కళాశాల చైర్మన్ ఎంఎం.కొండయ్య తెలిపారు. కేతనకొండ ఆర్కే కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న డ్రోన్స్ టెక్నాలజీ వర్క్‌షాపు బుధవారం ముగిసింది. ముగింపు సమావేశంలో పాల్గొన్న చైర్మన్ కొండయ్య మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో డ్రోన్స్ వినియోగం, టెక్నాలజీపై ప్రభుత్వం దృష్టి సారించనుందన్నారు. నూతన సాంకేతిక అందిపుచ్చుకుని భవిష్యత్ బంగారు బాటగా మార్చుకోవాలన్నారు. డ్రోన్స్ ప్రయోజనాలు, ఏ సందర్భాల్లో ఉపయోగించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల కార్యదర్శి ఎం.మహేంద్రనాథ్, కోశాధికారి ఎం.అమర్నాథ్, ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి


కొండపల్లిలో నివాళులర్పిస్తున్న కామేశ్వరరావు తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలు కొండపల్లి శాఖ గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయుడు నాగరాజు ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1913వ సంవత్సరం రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన గీతాంజలి సాహిత్యానికి నోబెల్ బహుమతి వచ్చిందన్నారు. ఆసియా ఖండంలోనే మొదటి నోబెల్ బహుమతి అని తెలిపారు. అనంతరం విద్యార్థులకు సమ్మర్ క్యాంపులో భాగంగా పుస్తక పఠనం, క్యారమ్స్, చెస్‌పై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: జాతీయ గీత రచయిత, నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి కార్యక్రమం తిరువూరు శాఖా గ్రంథాలయంలో రచయితల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఠాగూర్ రచించిన గ్రంథాలు, ఆయన జీవిత విశేషాలను రచయితల సంఘ అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ, ఉపాధ్యాయిని భరతకుమారి విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాధికారి పద్మావతి, రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి రేపాక రఘునంద, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితుల భూములు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి


ఆగిరిపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఆగిరిపల్లి: దళితుల భూములు ఆక్రమించుకున్న పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నగిరిపల్లిలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి రామకృష్ణ అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా భూస్వాధీన ఉద్యమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటపల్లి రెవెన్యూ భూమిలో ఉన్న సుమారు 40 ఎకరాల అసైన్డ్ భూమి పేదలు, దళితులకు చెందినదని వారి దగ్గర నుంచి పెత్తందారులు ఆక్రమించుకొని దౌర్జన్యాలు చేస్తున్నారని ఆరోపించారు. 20 ఏళ్ల నుంచి గ్రామానికి చెందిన పేదలు, దళితులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఈ భూములను భూ స్వాములకు కట్టబెట్టాలని చూస్తున్న అధికారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరా. అనంతరం సీనియర్ నాయకుడు సత్తు కోటేశ్వరరావు ఆక్రమిత భూమిలో జెండా పాతారు. ఇప్పటి నుంచి ఈ భూముల్లో పేదలు, దళితులు వ్యవసాయం చేస్తారని తెలిపారు. మండలంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను రీసర్వే చేసి పేదలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్తి కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘ మండల నాయకులు బుంగ రంగారావు, భూ పోరాట నాయకులు అర్జున్ రావు, అనిల్, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి



చాట్రాయి: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ జయంతిని మండలంలోని చనుబండ గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నడిపల్లి కిశోర్, జల్లేపల్లి పరమేశ్వరావు, వనమా కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో వేడుకలు..

నూజివీడు: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం 7 గంటలకు వాసవీ కన్యకాపరమేశ్వరి సత్రం నుంచి 108 మంది మహిళలు, సుహాసినులు మేళతాళాలతో కలశాలు తీసుకొని ఊరేగింపుగా ఆలయం వరకు వచ్చారు. అమ్మవారి ఉత్సవమూర్తికి కలశ జలం, పాలు, పంచామృతంతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి సామూహిక లలితా సహస్రనామార్చన, కుంకుమ పూజ జరిపారు. అనంతరం తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



గంపలగూడెంలో జయంతి

తిరువూరు: గంపలగూడెంలో బుధవారం వాసవీ మాత జయంతి వేడుకలు నిర్వహించారు. శ్రీరామ భజన మందిరంలో ఆర్యవైశ్యమహిళా విభాగం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, 108 కిలోలతో కుంకుమార్చన చేపట్టారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో నగరోత్సవం నిర్వహించారు.